కంటి వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఈనెల 9 నుంచి 15 వరకు జరుగుతున్న ప్రపంచ గ్లోకోమా వారోత్సవాల్లో భాగంగా స్థానిక డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అప్తాల్మిక్ అసిస్టెంట్ పి వి కె అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం కంటి వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లకోమా వ్యాధితో కంటి చూపుకు జరిగే అనర్థాలపై, వ్యాధి సోకకుండా ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆశ కార్యకర్తలకు, గిరిజనులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు పి.రాంబాబు, అంబిక రాణి, ఎంపీహెచ్ఇఒ సౌరి ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్

తాగునీటి సమస్యపై ఆందోళనలు

అరకులోయలో ఆందోళన చేస్తున మహిళలు, బాలదేవ్

ప్రజాశక్తి- అరకులోయ: అరకులోయలో గత వారం రోజుల నుండి తాగునీరు సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ తెలిపారు. సరభగుడ హౌసింగ్ కాలనీలో గ్రామస్థులతో కలిసి మరమత్తుకు గురైన బోరింగ్, కుళాయి వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, పెదలబుడు పంచాయితీ అరకులోయ పట్టణంతో పాటు, సరభగుడ, జడ్పీకాలనీ, సీ.కాలని, బి.కాలనీ, రెంటల్ హౌసింగ్ కాలనీ, కొండవీధి, ఆదివాసీ కాలనీ, సరభగుడ హౌసింగ్ కాలనీ, ఆసుపత్రి కాలనీ తదితర ప్రాంతాల్లో వారం రోజుల నుండి మంచి నీరు సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మంచినీటి సమస్యను తీర్చాలన్నారు.ఆర్ డబ్ల్యు ఎస్, పంచాయితీ అధికారులు మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, శాశ్వత పరిష్కారం చేయ లేదన్నారు.ఇకనైనా అధికారులు చర్యలు తీసుకుని అరకులోయ పట్టణంతో పాటు గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సరభగుడ హౌసింగ్ కాలని గ్రామస్తులు మాదాల కాసులమ్మ, కొర్రా రాజేశ్వరి, పి.మణి కిల్లో కుమారి,మల్లేశ్వరి కిల్లో రాజు, అజయ్, కొర్రా వెంకటరావు, మాదాల నినిబుడ్డి,బురిడి డొమిని, వంతాల విజయ్ రాజు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ వాకపల్లి గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామస్తులు స్థానిక సిపిఎం ఆధ్వర్యంలో గుంటసీమ సచివాలయ కేంద్రం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. సచివాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ పార్టీ మండల నాయకుడు పి డొంబు మాట్లాడుతూ వాకపల్లి గ్రామంలో తాగునీటి సౌకర్యంకు గత ఏడాది జల జీవన్ పథకం ద్వారా గ్రావిటీ పథకం మంజూరైనా అధికారుల నిర్లక్ష్యంతో గ్రామంలో ఇప్పటివరకు నిర్మించలేదన్నారు. దీంతో ఆ గ్రామస్తులు సమీపంలోని పొలంలోని నీటిని సేకరించి ఉపయోగిస్తూ పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలుషిత నీటిని ఉపయోగించడంతో ఆ గ్రామస్తులు మలేరియా, టైఫాయిడ్ వ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో గ్రావిటీ పథకం నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాందాస్ పొద్దు, జిన్ను, కృష్ణారావు, బాలదేవు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో ..వినతిపత్రాన్ని ఇస్తున్న సిపిఎం నేతలు, గ్రామస్తులు

అర్జీలను స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్)లో ప్రజలు ఇచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలపై 116 అర్జీలను సమర్పించారు. వాటిని పిఒ సింహాచలంతో పాటు సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం.రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడియంహెచ్ఓ జి.శిరీష, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, డిఎల్డిఓ కె.కోటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం డాక్టర్ వెంకట ఇందిర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, గాబ్రియేలు, రవికుమార్, తహశీల్దారు పి.రామకృష్ణ, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జన్ మన్ గృహాలకు..

రూ.10లక్షలు మంజూరు చేయాలి

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో పార్టీ కార్యదర్శి అప్పల నర్స

యత్రను చేపడుతున్న అప్పలనర్స, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స సోమవారం పాడేరు మండలం మోదపల్లి పంచాయతీ, వంటల మామిడి పంచాయతీ ఓనూరు గ్రామంలో పర్యటించారు. పందిదూర్లు గ్రామంలో గ్రామ ప్రజలతో ర్యాలీ నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు గ్రామంలో చేపట్టలేదని విమర్శించారు. గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకున్న ఆయన తక్షణమే రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. మంచినీటి కోసం అమ్మవారు పాదాల బ్రిడ్జి వద్ద కు వెళ్లాల్సిన వస్తోందన్నారు.ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న జన్ మన్ ఇళ్లకు రెండు లక్షల 39000 చెల్లిస్తున్నారని, ఈ సొమ్ము ఎటు సరిపోదన్నారు.. ఆదిమ జాతికి చెందిన గిరిజనులు మారుమూల రోడ్డు లేని ప్రదేశాల్లో ఉంటారని,వారికి ఇస్తున్న రెండు లక్షల 39 వేలు ఇల్లు కట్టే సామగ్రికే సరిపోదన్నారు. ప్రస్తుతం ఇసుక, ఐరన్ రేటు పెరిగిందని, సిమెంట్ ధర కూడా పెరిగి పోయిందన్నారు. ఈ రేట్లతో ఇల్లు పూర్తి కావాలంటే కనీసం 10 లక్షలైనా ఖర్చవుతుందన్నారు. ఒక ఇల్లుకి 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలామందికి అటవీ హక్కుల పట్టాలు లేవన్నారు. నూతనంగా పెళ్లయిన వారికి రేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలన్నారు. అర్హులైన వారికి అంత్యోదయ కార్డులు తక్షణమే ఇవ్వాలని తెలిపారు. ఈ నెల 12న చలో వంటలమామిడి సచివాలయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని తెలిపారు. సమస్యలపై దరఖాస్తులు రాసుకుని బుధవారం జరిగే వంటల మామిడి సచివాలయం కి రావాలని ఆయా పంచాయతీ గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పాలికి లక్కు, జిల్లా కమిటీ సభ్యులు వంతల దాసు, పాడేరు మండల కార్యదర్శి ఎం సుందర్రావు, జిల్లా నాయకులు గ్రామస్తులు నాగేశ్వరరావు, చిన్నారావ్, చిన్నయ్య, బాబురావు, మహిళలు విజయ, కమల పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న జెడ్పిటిసి గంగరాజు, నాయకులు

సచివాలయం ఏర్పాటుపై వినతి

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని వేంగడ పంచాయతీలో సచివాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీడీవోకు స్థానిక జెడ్పిటిసి గంగరాజు ఆధ్వర్యాన సోమవారం పంచాయతీ వార్డు మెంబర్లు వివిధ పార్టీల నాయకులు కలిసి లికిత పూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, వేంగడ పంచాయతీలో సుమారు 2500 మంది పైగా జనాభా కలిగి ఉన్నారన్నారు. 16 కిలోమీటర్ల దూరంలో గల పైనంపాడు పంచాయతీలో అప్పటి ప్రభుత్వం ఈ పంచాయతీని విలీనం చేయడంతో ప్రభుత్వం కల్పించే నిత్యావసరాలు తెచ్చుకునేందుకు వెళ్లలేని పరిస్థితితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం వెంగడ పంచాయతీ కేంద్రంలోనే సచివాలయం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు సివెరి. కొండలరావు, ఉప సర్పంచ్. ఎం గోవింద్, పీసా కమిటీ సభ్యులు ఎం. రామన్న, ఎస్. కళ్యాణ్, పి. భీమన్న, మణిక్ చందర్, సింహాద్రి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి

సిపిఎం మండల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ఎటపాక

మండల కేంద్రం ఎటపాకలో సిపిఎం మండల కార్యాలయం అమరజీవి కామ్రేడ్ ఇరపా శ్రీరాములు భవన్‌ను సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకులు ఇరపా సత్యం ఆవిష్కరించారు. అనంతరం మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేసే కార్యక్షేత్రం పార్టీ కార్యాలయం ప్రారంభించుకోవడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూనే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజల మధ్య వారధిగా నిలిచి కార్యకర్తలు నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, ఐ.పద్మ, జి హరనాథ్, ఇరపా సత్యం, పొడియం రత్తమ్మ, గద్దల హుస్సేన్, సవలం రాము, కారం జయమ్మ, నాయకులు తోట శ్రీను, పసుపులేటి ప్రవీణ్, తుర్రం లక్ష్మయ్య, పి సరవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున అంగన్‌వాడీలు

అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు: తమకు కనీస వేతనాలు చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఓ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సోమవారం పాడేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పాడేరు డివిజన్లోని పలు మండలాల నుంచి అంగన్వాడి వర్కర్లు ఈ కార్యక్రమానికి కదిలి వచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు భాగ్యలక్ష్మి, కొండమ్మ మాట్లాడుతూ, అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. అంగన్వాడీలకి వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారరకు 42 రోజుల పాటు సమ్మె నిర్వహించామన్నారు. సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు 2024 జూలై లో వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి బడ్జెట్ సమావేశాల సందర్భంగా తమ సమస్యలను పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

అంగన్వాడి కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని, సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని విజయవాడలో శాంతియుతంగా మహా ధర్నా కార్యక్రమానికి తరలి వెళుతుండగా రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా పోలీసులతో భగ్నం చేయాలని చూసిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు విమర్శించారు. అంగన్వాడీల నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కనీస వేతనం రూ.26000 చెల్లించాలని సమ్మెలో ఒప్పందాలని అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలని డిమాండ్ చేశారు.పాడేరు జిల్లా పిడి అంగన్వాడీ యూనియన్ నాయకులను బెదిరిస్తున్నారని తెలిపారు. పాడేరు పిడి పై శిశు సంక్షేమ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పిడి వైఖరి మార్చుకోకపోతే పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలు కొండమ్మ, డుంబ్రిగూడ మండల అధ్యక్షురాలు కొండమ్మ పలు మండలాల అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు, వర్కర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టర్ ను కలిసిన సిఇఒ

ప్రజాశక్తి-పాడేరు : కాకినాడ జిల్లా పరిషత్ సీఈవో వివివిఎస్ లక్ష్మణరావు సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంప చోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో గల మండలాల్లో కాకినాడ జిల్లా పరిషత్ తరపున చేపట్టిన వివిధ పథకాల అమలు, వాటి పురోగతిపై చర్చించారు.

పూల కుండీని ఇస్తున్న సిఇఒ

వాలంటీర్ల సమస్యలపై 17న చలో విజయవాడకు తరలిరండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

గ్రామ, వార్డు వాలంటీర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న జరుగు చలో విజయవాడ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వాలంటీర్లు తరలివచ్చి జయప్రదం చేయాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. ఎపి గ్రామ వార్డు వాలంటీర్ల యూనియన్ (సిఐటియు) ముఖ్య నాయకుల సమావేశం యూనియన్ చింతూరు మండల కార్యదర్శి కలుములు మహేష్ అధ్యక్షతన సోమవారం చింతూరులో జరిగింది. ఇందులో పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండున్నర లక్షల మంది వాలంటీర్లు ఈ నెల 17న జరుగు చలో విజయవాడ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. వైసిపి ప్రభుత్వం వాలంటీర్ల చేత వెట్టి చాకిరీ చేయిస్తుందని, కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని చంద్రబాబునాయుడు, కూటమి నేతలు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 9 నెలలైనా నేటికీ వారికి తిరిగి విధుల్లోకి తీసుకోలేదని, వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. దీంతో రెండున్న లక్షల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, బలవంతపు రాజీనామా చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బలవంతపు రాజీనామా చేసిన వాలంటీర్లను కూడా వీధుల్లోకి తీసుకోవాలని కోరారు. వాలంటీర్ల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఎటపాక మండల కార్యదర్శి భూక్య కుమార్, నాయకులు గడ్డల వనరాజ్, సాదుల రామిరెడ్డి, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

అందుబాటులో లేని పశువైద్యులు

- నెలలో ఒకటి రెండు రోజులే విధులకు హాజరు
- మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతుల ఆవేదన
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని గౌరీదేవిపేట పశువైద్య శాల డాక్టర్ అందుబాటులో ఉండడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పశువులకు సరైన వైద్యం అందకా అవి మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గౌరీదేవిపేట పశు వైద్యశాల పరిధిలో గొమ్ముకొత్తగూడెం, టిపి వీడు, గన్నవరం, లక్ష్మీపురం, విస్సాపురం, గౌరీదేవిపేట, నందిగామ తదితర ఏడు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్‌ల ద్వారా పశువులకు వైద్యం అందిస్తున్నారు. 7 సచివాలయాల పరిధిలో ఒక్కరే పశువైద్యులు ఉన్నారు. ఆయన కూడా విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. పశు వైద్యాన్ని వెటర్నరీ అసిస్టెంట్‌లతో చేయిస్తూ తాను మాత్రం నెలకు ఒకటి రెండు రోజులు మాత్రమే ఆసుపత్రికి వస్తుంటారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆయనకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని రైతులు వాపోతున్నారు. సరైన వైద్యం అందక మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతధికారులకు సదరు డాక్టర్‌పై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్యునిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గౌరీదేవిపేట పశు వైద్యశాల

విధుల నుండి తొలగించాలి

గౌరీదేవిపేట పశు వైద్యాధికారి విధులకు హాజరు కాకుండా జీతం తీసుకుంటున్నారు. కనీసం ఫోన్ చేసినా స్పందించకుండా ఉండే వైద్యుడుని తక్షణమే విధుల్లో నుండి తొలగించాలి. వైద్యుని నిర్లక్ష్యం కారణంగా పశువులు మరణిస్తే వాటిని పశువుల వైద్యశాల ముందే ఉంచి నిరసన చేపడతాం. పశు వైద్యాధికారి స్థానికంగా ఉండేలా ఐటీడీఏ పిఒ చర్యలు తీసుకోవాలి.

- కాకా అర్జున్ దొర, సిపిఎం మండల కార్యదర్శి

గాయపడిన జింకకు వైద్యం చేస్తున్న దృశ్యం

కుక్కల దాడిలో గాయపడ్డ జింక

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల మండలం ఎల్లవరం పంచాయతీ పాపంపేట గ్రామ చివరి ప్రాంతంలో నీటి కోసం కాలువ వద్దకు వచ్చిన జింకపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన జింకను గ్రామస్తులు సహాయంతో ఫారెస్ట్ అధికారులు అడ్డతీగల పశు వైద్యశాలకు తీసుకొొచ్చి చికిత్స అందించారు. జింక నిండు గర్భిణి అని, గాయాలు తగ్గిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి అడవిలో విడిచి పెడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బందితో అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న గృహనిర్మాణం, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి, గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై సంబంధిత అధికారులతో లోతుగా సమీక్షించి గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా పంచాయతీ కార్యదర్శులు వేసవి తాగునీటి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. పాడైపోయిన చేతి పంపులు, తాగునీటి బోరులను సత్వరమే బాగుచేయించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి మూడో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మారేడుమిల్లి, సున్నంపాడు, జియం వలస పంచాయతీలలో అక్రమ కట్టడాలు, టూరిస్ట్ రిసార్ట్స్ ఉన్నాయని, వారందరికీ త్వరలో తాఖీదులు జారీ చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ సహాయక ఇంజినీర్లు బి.నారాయణరావు, రాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్

పక్కాగా భూముల రీ సర్వే

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : పక్కాగా భూముల రీ సర్వే ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ మండల సర్వేయర్లు, సర్వే డిప్యూటీ తహశీల్దారులు, గ్రామ సర్వేయర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించి భూ సరిహద్దులను సక్రమంగా గుర్తించాలని చెప్పారు. సర్వే చేయడానికి వసూళ్లకు పాల్పడితే సంబంధిత సిబ్బంది పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 22 ఎ ప్రకారం భూముల రిజిస్ట్రేషన్ కు ఫారం కె,ఫారం ఎల్ లను ఆన్లైన్ చేస్తామని పేర్కొన్నారు. సర్వే నిర్వహిస్తున్నట్లు ముందుగానే ఆయా గ్రామాలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. భూముల సర్వేపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ, భూముల రీ సర్వేను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేసారు. పాడేరు రెవెన్యూ డివిజన్లో మండలానికి రెండు గ్రామాలను పైలట్ గ్రామాలుగా తీసుకుని సర్వే చేస్తున్నామన్నారు. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 375 గ్రామాల్లో సర్వే పూర్తి చేసారన్నారు. భూ రికార్డుల క్రమబద్ధీకరణ, వెక్టరైజేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అవసరమైన చోట మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సర్వే పూర్తి చేయక పోతే గ్రామ సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వే చేయడానికి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, విచారించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లోపాలు లేకుండా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, 11 మండలాల మండల సర్వేయర్లు, సర్వే డిప్యూటీ తహశీల్దారులు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యపై వినతి

వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపిటిసి, గ్రామస్తులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అనంతగిరి మండలంలోని కివర్ల పంచాయతీ మారుమూల కొండ శిఖర నక్కులమామిడి పివిటిజి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కివర్ల మాజీ ఎంపీటీసీ దురియా నూకరాజు ఆధ్వర్యంలో జీసీసి చైర్మన్, కిడారి శ్రావణ్ కుమార్‌కు సోమవారం పాడేరులో వినతిపత్రం అందజేశారు. నక్కులమామిడి గ్రామంలో సుమారు 65 పివిటిజి నిరుపేద కుటుంబాలు నివసిస్తు న్నారన్నారు. రోడ్డు సౌకర్యం లేక ఎవరైనా అనారోగ్యం గురయితే డోలిమోత తప్ప మరో మార్గం లేదని తెలిపారు. తక్షణమే గ్రామానికి రోడ్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సరైన రోడ్ సౌకర్యం లేక కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పీఎం జన్మన్ ఇల్లులు నిర్మించుకోవడానికి వివిధ ముడి సరుకును మూడు కిలోమీటర్లు ఎత్తైన కొండ కోనలు దాటి తీసుకెళ్లవలసిన పరిస్థితి వస్తుందని తెలిపారు. అధికారులకు,ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంతో గ్రామస్తులు చందాలు వేసుకొని సొంతంగా మూడు కిలోమీటర్ల వరకు రోడ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వంతల నాగేశ్వరావు, పంతల మత్స్యరాజు, వంతల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

29న ధారాలమ్మ జాతర

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్‌లో ఉన్న ధారాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు దేవాలయ శాఖ ఈవో సాంబశివరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ జాతరకు సంబంధించి ఈ నెల 20న ముహూర్తపురాట వేస్తామని, అమ్మవారి గరగలు తీస్తామని పేర్కొన్నారు. ఈనెల 26న అమ్మవారి కలశ స్థాపన చేస్తామని, 29న శనివారం ప్రధాన పండుగ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ జాతరకు ఆంధ్ర, ఒరిస్సా, తెలంగాణ, చతీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఆలయ ప్రాంగణంలో కల్పిస్తామన్నారు. పురుషులకు, స్త్రీలకు టాయిలెట్స్ సదుపాయాలతో పాటు వచ్చిన భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఐదు రోజులు అమ్మవారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ సమీపంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో సాంబశివరావు వెల్లడించారు.

నేడు నిర్వాసితుల సమస్యలపై అఖిలపక్ష సమావేశం

ప్రజాశక్తి-విఆర్.పురం : పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఈ నెల 11న మంగళవారం ఉదయం 10 గంటలకు మండలంలోని రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మేధావులు, మీడియా మిత్రుల సమక్షంలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసిత ప్రజలందరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో నిర్వాసితుల సమస్యలపై చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు.

సప్పర్లలో పనిచేయని సెల్ సిగ్నల్

తరచూ అంతరాయంతో బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవస్థలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ సప్పర్ల గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలల నుంచి సెల్ సిగ్నల్స్ సరిగా పనిచేయక బంధువులు యోగ క్షేమాలు తెలుసుకోవడం కోసం, ఇతర అవసరాలు కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సెల్ సిగ్నల్స్ నెట్ వర్క్ తరచూ పనిచేయడం లేదనిబిఎస్ఎన్ఎల్ అధికారులకు వినియోగదారులు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెల్ సిగ్నల్స్ వచ్చిపోయినట్లు అవుతుంది తప్ప పూర్తి స్థాయిలో సిగ్నల్ రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ సేవలలో తరచూ సాంకేతికపరమైన సమస్యలు తలెత్తుతుండడంతో అంతర్జాలాలు మూగబోతున్నాయని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సెల్ సిగ్నల్స్, నెట్ వర్క్ సేవలు పూర్తిస్థాయిలో వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సప్పర్లలోని సెల్ టవర్

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-అడ్డతీగల : విజయవాడ అమ్మ హెల్పింగ్ ఫౌండేషన్ (ఎహెచ్ఎఫ్) ఆధ్వర్యంలో మండలంలోని రాయపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులకు సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు. దూర ప్రాంతం నుండి నడిసి వచ్చే పేద విద్యార్థులకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో జి.దివ్య, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేష్, ఏఎన్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న అమ్మ హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు

పోడు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి- చింతపల్లి: గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. కొత్త వీధి గ్రామస్తులతో కలిసి గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 35 సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల బతుకులు మారలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త వీధి గ్రామంలో సుమారు 25 కుటుంబాల ప్రజలు జీవిస్తున్నారని, కొంతమందికి తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వివాహాలు చేసుకుని విడిపోయిన కుటుంబాలకు కూడా తెల్ల రేషన్ కార్డులు లేకపోవడంతో కొత్తగా మంజూరు చేసే గృహాలు. పొందలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి మంజూరైన రోడ్డు కూడా ఇంతవరకు నిర్మించ లేదన్నారు.వేసవికాలం సమీపించక ముందే తాగునీటి సమస్యతో ప్రజలు సతమతమ వుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సిపిఎం తలపెట్టిన ప్రజా చైతన్య యాత్రలను ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మజ్జి రాంబాబు, చైతన్య, లక్కీ భీమరాజు, వంతల రాంబాబు, లక్కీ షర్మిల, బురిడి సోమేశ్ కుమార్, లతా సావిత్రి గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత చిన్నయ్య పడాల్

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

లబ్ధిదారులు తో మాట్లాడుతున్న సిపిఎం నేత సన్నిబాబు

ప్రజాశక్తి-పెదబయలు: కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ ఇల్లు మంజూరు చేసిన లబ్ధిదారులకు వెంటనే ఇల్లు స్థలాలు మంజూరు చేయాలని మండల సిపిఎం కార్యదర్శి బోండా సన్నిబాబు సోమవారం డిమాండ్ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలో సీత గుంట గ్రామ సచివాలయం పరిధిలో పెదబయలు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇల్లు స్థలాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక తహసిల్దార్‌కి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు మాట్లాడుతూ,ఇటీవల కేంద్రం ప్రభుత్వం వెనుకబడిన ఆదివాసి తెగలకు పిఎం జన్మన్ ఇల్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేశారని స్థలం పట్టాలు ఇచ్చారని, స్థలం చూపని కారణంగా లబ్ధిదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.అధికారులు వెంటనే స్పందించి ఇల్లు స్థలాలు లబ్ధిదారులకు ఇచ్చినట్లయితే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పీఎం జన్మన్ ఇల్లు నిర్మించుకొనుటకు అవకాశం ఉంటుందన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి- అనంతగిరి: విద్యుత్ చార్జీల పెంపుపై మండలంలోని భీంపోలు సచివాలయం వద్ద సోమవారం సిపిఎం మండల నాయకులు జేష్ట. వెంకటరమణ ఆధ్వర్యన ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ట్రు అప్ చార్జీల పేరుతో బారిగా విద్యుత్ ఛార్జీలు పెంచిందని, తక్షణమే ఉపసరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు సూకురు. సింహాచలం,. లక్ష్మణరావు పాల్గొన్నారు

చింతపల్లి: ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి. అధికారంలోకి.వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు మోపడంపై సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ ఆధ్వర్యాన సోమవారం మండల కేంద్రంలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి పాలన గత ప్రభుత్వం తీరులోనే పాలనను కొనసాగిస్తుందని విమర్శించారు. తక్షణమే భారాలను ఉపసంహరించుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు, నాగేంద్ర వినియోగదారులు పాల్గొన్నారు.

భీంపోలులో నినాదాలు చేస్తున్న గిరిజనులు

'ముత్యం' ఆశయ సాధనకు కృషి చేయాలి

వర్ధంతి సభలో సిపిఎం నేతలు వెంకట్, సురేష్

ప్రజాశక్తి-చింతూరు : గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించిన అమరజీవి కామ్రేడ్ పట్రా ముత్యం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని తుమ్మల గ్రామంలో కామ్రేడ్ మొట్టం రాజయ్య అధ్యక్షతన పట్రా ముత్యం 11వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముత్యం స్థూపం వద్ద సిపిఎం జెండాను ఆవిష్కరించి, ఆయన చిత్ర పటానికి పూలమాలలు ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వెంకట్, సురేష్ మాట్లాడుతూ పోస్టల్ డిపార్టుమెంట్ పని చేసిన కామ్రేడ్ ముత్యం సిపిఎం విధానాలకు ఆకర్షితులై ప్రజల అభివృద్ధికి, గ్రామాల్లో మౌలిక సౌకర్యాల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. తుమ్మల, చిడుమూరు ప్రాంతంలో ఎర్రజెండా చేత పెట్టి, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. డోలు కొయ్యలు కళలను, కళాకారులను దేశానికి పరిచయం చేసి తుమ్మల గ్రామానికి మంచి పేరుని తీసుకొచ్చారని తెలిపారు. అటువంటి నాయకుడిని నక్సలైట్లు అర్ధరాత్రి హత్య చేసి ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను విచ్ఛిన్నం చేసి ఏజెన్సీ ప్రాంత సంపదలను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను అనుసరిస్తున్నాయని తెలిపారు. ఇటువంటి తరుణంలో ఏజెన్సీ ప్రాంత హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు గిరిజనులను ఐక్యం చేసి ప్రజా పోరాటాల నిర్వహించడమే ముత్యంకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుమ్మల ఎంపీటీసీ వేక రాజ్ కుమార్, సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు పట్రా రమేష్, మొట్టమ్ నాగేశ్వరరావు, శాఖా కార్యదర్శులు లెనిన్, గణేష్, పొద్దయ్య, కిట్టయ్య, దుర్గారావు, కుటుంబ సభ్యులు రాధాకృష్ణ, పాపారావు, జయ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా పట్టణాభివృద్ధి

గీతం సదస్సులో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసోజా

ప్రజాశక్తి-మధురవాడ : పెరుగుతున్న పట్టణ జనాభా, వసతి అవసరాలకు అనుగుణంగా పట్టణాలను ప్రణాళికాయుతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని గీతం వర్సిటీ వీసీ డాక్టర్ ఎరోల్ డిసౌజ అన్నారు. సోమవారం గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో 'కంపాసినేట్ సిటీస్' సదస్సును ప్రారంభించి, మాట్లాడుతూ, వ్యాపార కేంద్రాలుగా ఆర్థిక ప్రగతిలో పట్టణాలు కీలక పాత్ర పోషించనున్నాయని, దానికి అనుగుణంగా నిర్మాణాలు ఉండాలన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ డాక్టర్ విభూతి సచ్చదేవ్, విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు సోహన్ హట్టంగడి మాట్లాడుతూ, పట్టణాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ, ప్రాచీన వారసత్వ కట్టడాల సంరక్షణ దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ డైరక్టర్ సుజీత్‌కుమార్ డోంగ్రే మాట్లాడుతూ, తీర ప్రాంత పరిరక్షణ అంశాల ప్రాధాన్యతను వివరించారు. ఆర్కిటెక్ట్ వి.రబీంద్ర, ఇన్‌క్యూబిస్ వ్యవస్థాపకుడు అమిత్‌కృష్ణ గులాటి, ఎపి క్రాఫ్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ రేణుకా రాణి, ధాన్ ఫౌండేషన్ పర్యావరణ ఇంజనీర్ ఎస్.లోకేష్, పూర్ణమిదమ్ సంస్థ వ్యవస్థాపకురాలు కావ్యా పూర్ణిమా, ఆర్కిటెక్ట్ హర్షగోయల్ మాట్లాడారు.

ఎన్ఆర్ఐ మహిళ మృతిపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మేఘాలయ హోటల్‌లో ఎన్ఆర్ఐ మహిళ కాకర్లపూడి రోజా మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని మహిళా చేతన కార్యదర్శి కె.పద్మ డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ నెల 6వ తేదీన రోజా మేఘాలయ హోటల్ రూమ్‌లో చనిపోతే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మూడో పట్టణ పోలీసులు సమాచారాన్ని మీడియాకి తెలియపరచకపోవడం ఆశ్చర్యం కలిగించేదిగా, అనుమానాస్పదంగా ఉందన్నారు. మృతికి కారణాలు తెలియకుండానే ఎఫ్ఐఆర్‌లో నో అక్యూజ్డ్ అని ఎలా రాసారని ప్రశ్నించారు. ఘటనా స్థలంలోనే ఉన్న డాక్టర్ శ్రీధర్‌ను ఎందుకు అనుమానించలేదని అడిగారు. అతని ఫోన్ ని, మృతురాలు రోజా ఫోన్‌ను సీజ్ చేస్తే మృతికి గల కారణాలు తెలిసి ఉండేవి కదా, ఆ ఫోన్లను ఏమిచేశారో పోలీసులే చెప్పాలన్నారు. ఏ మహిళ అయినా నగ్నంగా మారి ఆత్మహత్య చేసుకుంటుందా? అని ప్రశ్నించారు. మూడో పట్టణ పోలీసులు, పైఅధికారుల అనుమానాస్పద తీరుపై సిపి స్వయంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భారత నాస్తిక సమాజం జిల్లా కార్యదర్శి వై.నూకరాజు, సత్యవతి, నాగమణి, మంగవేణి, లావణ్య పాల్గొన్నారు.

బిసిల డిమాండ్లపై 'చలో ఢిల్లీ'

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : బిసిల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా బిసి సంఘం అధ్యక్షులు భోగి రమణ పిలుపునిచ్చారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం ఆధ్వర్యాన బిసిల డిమాండ్ల కోసం ఈ నెల 12, 13 తేదీలలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను బిసి నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఒబిసిలకు 50 శాతం రాజకీయ రిజర్వే షన్ కల్పించాలని, బిసి మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు పెట్టాలని, కేంద్రంలో ఒబిసిలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యమ నేత పితాని ప్రసాద్, ఎఐసిసి సభ్యులు జివి.నారాయణరావు, వావిలపల్లి శ్యామ్ సుందర్‌నాయుడు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్ వినతులను పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ కార్యాలయంలో ప్రజా దర్బార్‌కు వచ్చిన ఫిర్యాదులు, వినతులు గడువులోగా పరిష్కరించాలని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం బాధితుల సమస్యలను వారు స్వయంగా విని వినతుల స్వీకరించారు. ఎక్కువగా వచ్చే ప్రైవేట్ లే-అవుట్‌లకు చెందిన ప్లాట్‌ల విషయంలో వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జివిఎంసిలో 90 వినతులు

జివిఎంసిలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 90 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనరు డివి.రమణమూర్తితో కలిసి మేయర్ సోమవారం వినతులు స్వీకరించారు.

ఫ్యాషన్ టూర్ విజయవంతం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : బ్లెండర్స్ ప్రైడ్ ప్యాకేజ్‌డ్ డ్రింకింగ్ వాటర్ సంస్థ ఆధ్వర్యాన ది వన్ అండ్ ఓన్లీ ఫ్యాషన్ టూర్ పేరుతో బీచ్ రోడ్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన ఫ్యాషన్ టూర్ విజయవంతం అయిందని ప్రముఖ డిజైనర్ అక్షత్ బన్సాల్ తెలిపారు. సోమవారం ఉదయం బీచ్ రోడ్డులోని ఒక ప్రవేటు హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ప్రముఖ సిని నటి తమన్నా భాటియా, ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, రిత్విజ్ అండ్ టీం అందించిన మ్యూజిక్‌కు యువత డ్యాన్సులు చేస్తూ మైమరిచిపోయారని తెలిపారు. ఈ షో ను విజయంతం చేసినందుకు విశాఖ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పిజిఆర్ఎస్‌కు రెండు అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు అర్జీలు వచ్చాయని జెడ్‌సి పిల్లి ప్రేమ ప్రసన్నవాణి తెలిపారు ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలకు నివేదించినట్లు జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి తెలిపారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-చింతపల్లి : కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఈ కారణంగా ఈనెల 12న తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చింతపల్లి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియ పుష్పలత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ యువతీ యువకులకు నెలకు నిరుద్యోగ భృతి 3 వేలు చెల్లిస్తామని, ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లిస్తామని మోసపూరితమైన హామీలు గుప్పించి అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చిందన్నారు. యువత పోరు కార్యక్రమానికి అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి: గిల్లలబంద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నవరం ఎస్సై వీరబాబు పరీక్షల ప్యాడ్లు, కలర్ పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామాల గిరి విద్యార్థినీ విద్యార్థులు విద్యపై ఆసక్తి చూపించాలన్నారు. విద్యార్థులు విద్యపై మక్కువతో చదివితే భవిష్యత్తు బంగారు భవిష్యత్ ఉంటుదన్నారు.విద్యార్థులను విద్యతోపాటు ఆటల పోటీల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. భోజన సమయంలో విద్యార్థులు కాళ్లు చేతులు శుభ్రంగా కడుక్కుని భుజించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఘనంగా దొన్నుదొర జన్మదిన వేడుకలు



కేక్ తినిపిస్తున్న టిడిపి, నాయకులు అభిమానులు.

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విజయనగరం ఆర్టీసి బోర్డు రీజినల్ చైర్మన్, అరకు నియోజకవర్గ ఇన్చార్జి దొన్నుదొర జన్మదిన వేడుకలు సోమవారం అరకులోయ మండల కేంద్రంలోని తన నివాసగృహంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అరకు నియోజకవర్గానికి చెందిన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు,అభిమానుల సమక్షంలో దొన్ను దొర కేకు కట్ చేశారు.

'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'పై అవగాహన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమాగిరి అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సందర్శించి విద్యార్థులను అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు లేక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలను దూరంగా ఉండాలన్నారు. ఆన్లైన్ మోసాలకు మోసపోవద్దన్నారు. పదవ తరగతి విద్యార్థులు భాగా చదువుకొని మంచి మార్కులతో పాస్ అవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐలు భవ్య, శకుంతల, పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి

ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని మండలంలోని రేఖపల్లి ఏఎస్‌డిఎస్ వికలాంగుల కోఆర్డినేటర్ రవి సోమవారం పాడేరు ఎపిఎస్ఆర్‌టిసి డిపో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. వికలాంగులకు బస్సుల్లో ప్రత్యేక సీట్లు లేకపోవడంతో నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోందని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రత్యేక సీట్లు కేటాయించాలని ఈ ఏడాది జనవరి 3న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు లెటర్ పెట్టామన్నారు. సీటు కేటాయించడంతో పాటు సీటు వెనుక భాగంలోనూ, విండో సైడు భాగంలోనూ ఈ సీటు వికలాంగులకు మాత్రమే అని రాయాలని కోరారు. దీనికి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. ప్రయాణికులు కూడా వికలాంగులకు సహకరించాలని కోరారు.

పాడేరు డిఎమ్‌కు వినతిపత్రం ఇస్తున్న రవి

ప్రజాప్రతినిధులను విస్మరించడం తగదు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలో ఐటీడీఏ, ఉద్యానవన శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న వ్యవసాయ పరికరాల పంపిణీలో మండల ప్రథమ పౌరురాలైన ఎంపీపీని విస్మరించడం చాలా విచారకరమని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రహస్యంగా పరికరాలు పంపిణీ చేయడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ఆమె ఐటీడీఏ అధికారులను ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాగే అనేకసార్లు చేశారని, వారి ప్రవర్తనలో మార్పు రాలేదని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధిని, ప్రథమ పౌరురాలైన తనను ప్రోటోకాల్ ప్రకారం పరికరాల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానించని అధికారులపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు.

చలి వేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-చింతూరు : వేసవి ఎండ తీవ్రత అధికం కావడంతో ప్రయాణికులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చింతూరులో సోమవారం యాసిన్ మసీద్ ముస్లిములు విద్యుత్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మసీద్ గురువు ఇజా అహ్మద్, షేక్ సుభాని, ఎండి జోహార్, ముర్షిద్, కరీముల్లా, దస్తగీర్ తదితరులు పాల్గొన్నారు

ఏడు లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలం అంగుళూరు గ్రామంలో ఏడు లీటర్ల నాటుసారాను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఎస్సై షరీఫ్ తెలిపిన వివరాలు ప్రకారం... అంగుళూరు గ్రామంలో సారా విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఏడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. సారా వ్యాపారాలు నిర్వహిస్తే కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మంటల్లో కారు దగ్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా సాయి కిరణ్ విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాల దగ్గరలో సోమవారం సాయంత్రం కారులో ఆకస్మికంగా మంటలు వ్యాపించి కారు దగ్ధమైంది. సాయి కిరణ్ విద్యానికేతన్ పాఠశాల నుండి తమ పిల్లలను తీసుకెళ్లడానికి లాగరాయి నుండి రాజవొమ్మంగి వచ్చి పాఠశాల ఎదురుగా కారు ఆపారు. ఆకస్మికంగా కారు రేడియేటర్ నుంచి పొగలు వచ్చి మంటలు వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. గ్రామస్తులు సహాయంతో మంటలను ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్నవారు మంటలు వ్యాపించే సమయంలో కారు దిగిపోవడంతో ఎవరికీ ఏ ప్రమాదం చోటుచేసుకోలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మంటల్లో దగ్ధమౌతున్న కారు